

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 20 మే 2026 పేజీలు : 04


## నష్టపరిహార నిర్ణయంపై
# అన్నదాతల ఆక్రోశం

- సమ్మతికి రాకపోతే చట్టాన్ని అనుసరిస్తామన్న జేసీ విష్ణుచరణ్
- ఆగ్రహంతో చర్చను బహిష్కరించిన అన్నదాతలు
- ప్రాధేయపడి వెనక్కు పిలిచిన రెవెన్యూ అధికారులు
- పట్టాదారులతో అర్ధాంతరంగా ముగిసిన చర్చ



భూసేకరణ చర్చా సమావేశానికి హాజరైన రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్



చర్చకు అనుమతించకపోవడంతో చింతిస్తున్న డి.పట్టా రైతులు

**యాడికి(తాడిపత్రి), మే 19, ప్రభాతవార్త:**
యాడికి మండల పరిధిలోని కమలపాడు పంపుడ్ స్టోరేజి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు కోసం పట్టా భూముల భూసేకరణకు సంబంధించి నష్టపరిహార నిర్ణయంపై బాధిత రైతులు ఆక్రోశం వ్యక్తం చేశారు. చింతలాయపల్లి సమీపంలోని కొత్తరాయుని గుడి ఆవరణంలోని మంటపంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆధ్వర్యంలో భూసేకరణ ధరల నిర్ణయంపై చర్చావేదిక ఏర్పాటు చేశారు.ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో రూ.4,676.5కోట్ల పెట్టుబడితో 950 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న ఈపవర్ ప్రాజెక్టుకుకుందనకోట, చింతలాయపల్లి, గ్రామాలపరిధిలోని 220మందిరైతులు 399ఎకరాల పట్టాదారు భూములను కోల్పోనున్నారు. ఈభూముల ధరలను నిర్ణయించడానికి ఉద్దేశించిన ఈ చర్చవేదికలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, ఆర్డీవో శ్రీనివాసన్, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ప్రాజెక్టు ఈఈ ఆదినారాయణరెడ్డి వేదికపై ఆసీనులయ్యారు. ఈచర్చావేదికలో రైతులు సంయమనం పాటించి ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి కోరారు. పట్టా భూములు కోల్పోతున్న రైతులు మాత్రమే చర్చావేదికలోకి రావాలని అధికారులు షరతులు



ఎకరం రూ.24 లక్షలైనా ఇవ్వాలని కోరుతున్న కుందనకోట రైతులు

విధించడంతో డి.పట్టా భూములు కోల్పోతున్న రైతులు వేదిక బయటే ఆశగా వేచిచూసి నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. చర్చ ప్రారంభంలో ఆర్డీవో మాట్లాడుతూ యాడికి సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో సేకరించిన ధరల ప్రకారం కాకుండా రైతులను దృష్టిలో పెట్టుకొని కుందనకోట భూములకు ఎకరం రూ. 3.5 లక్షలు, చింతలాయపల్లి భూముల ధరలు ఎకరం రూ. 6.5 లక్షలు వంతున ప్రాథమికంగా నిర్ధారించామని తెలిపారు. దీంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో కొన్ని పరిధుల వేరకు యాడికి మండల కేంద్రంలో భూముల విలువను ఇక్కడి భూములకు అన్వయించి రెండు గ్రామాల భూములకు ఎకరం రూ. 8 లక్షలకు పెంచి పరిహారం ఇవ్వగలమని జేసీ విష్ణుచరణ్ తెలిపారు. రైతుల నుంచి అభిప్రాయాలు తెలపమని జేసీ



నిరాశపరచవద్దని చేతులు జోడించి వేడుకుంటున్న రైతు విరూపాక్షిరెడ్డి

కోరగా సమీపంలోని నంద్యాల జిల్లా భూముల ధర రూ. 30 లక్షలు పలుకుతోందని, సమీపంలోని తాడిపత్రి ప్రాంతంలో జాతీయ రహదారికి ఎకరం రూ.26 లక్షలకు ప్రభుత్వమే కొనుగోలు చేసిందని వాటిని దృష్టిలో పెట్టుకొని పరిహారం నిర్ణయించాలని రైతులు ధనుంజయరెడ్డి, మహేశ్వరరెడ్డి, గురుమోహన్‌రెడ్డి శివనాథరెడ్డి,రాజశేఖర్‌రెడ్డి తదితరులు తెలిపారు. ఆ స్థాయి పరిహారం చెల్లించడం అసాధ్యమని, సమ్మతి పద్ధతికి అన్నదాతలు అంగీకరిస్తే 15 రోజుల్లో ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని, లేదంటే చట్ట ప్రకారం ముందుకు సాగాల్సి వస్తుందని జేసీ విష్ణుచరణ్ పేర్కొనడంతో మీ అభిప్రాయ వ్యక్తీకరణ బెదిరింపు ధోరణిలో ఉందని పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకొని మా భూముల ధరలను కనీసం రూ.25 లక్షలైనా నిర్ణయించాలని వారు కోరారు.

**::అన్నదాతల ఆక్రోశం..!**

అంత వ్యత్యాసంతో కూడిన ధర ఇవ్వలేమని చివరిగా రూ. 9.41 లక్షల వరకు చెల్లించగలమని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ప్రకటించడంతో అన్నదాతలు ఆక్రోశం ప్రదర్శిస్తూ చర్చావేదిక నుంచి నిష్క్రమించారు. వెనుదిరిగి వెళుతున్న అన్నదాతలను తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు, సీఐ శ్రీనివాసులు, ఎస్సైలు ధరణిబాబు, గోపాల్, ఇతర పోలీసు సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేశారు. చివరికి తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి పలువురు అన్నదాతలను స్థానిక నాయకుల సాయంతో ప్రాధేయపడి వెనక్కు పిలుచుకొని వచ్చారు. భూములను కోల్పోయి జీవనాధారం లేని మా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరిహారం విషయంలో అన్యాయం చేయకండి అని కుందనకోట రైతు విరూపాక్షిరెడ్డి అధికారులకు చేతులెత్తి మొక్కుతూ ప్రాధేయపడ్డాడు. మా భూములకు తక్కువ ధర కల్పించి అవమాన పరచకుండా అంతే విలువైన భూములను మాకు యాడికి ప్రాంతంలో ఇప్పించండి అని, లేకుంటే భూములు ఇచ్చేది లేదని రంగారెడ్డి అనే రైతు తెగేసి చెప్పాడు. చింతలాయపల్లికి చెందిన చిన్నారి కళ్యాణ్ తన పేరున ఉన్న ఒకటిన్నర ఎకరా, తన సోదరుడు అశోక్‌కు చెందిన ఒకటిన్నర ఎకరా భూసేకరణలో పోతోందని, పరిహారం గురించి మాట్లాడుతుండగా అధికారులు మధ్యలోనే వారించడం ఆసక్తికరంగా మారింది. మీరు అడిగేంత స్థాయిలో పరిహారం చెల్లించడం అధికారులకు, మాకు సాధ్యం కాదని కంపెనీ ప్రతినిధి ఒకరు సభలో చెప్పడంతో ఆదినారాయణరెడ్డి, రామారావు, గంగాధర్, క్రిష్ణాంజనేయులు తదితర రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. అధికారులు చివరికి మరో రూ. లక్ష కాని, రూ. 2 లక్షలు కానీ పెంచగలమని, మరీ పట్టుపడితే 30 శాతం పెంచి ఎకరం రూ.12,23,300 లు చెల్లిస్తామని, లేదంటే చట్టప్రకారమే పోతామని జేసీ తెలిపారు. 30 శాతం కాకుండా కనీసం 100 శాతం పెంచమని అన్నదాతలు కోరగా అధికారులు ససేమిరా అన్నారు. దీంతో అన్నదాతలు కూడా సభావేదిక నుంచి



రైతులను ప్రాధేయపడి వెనక్కు పిలుచుకొని వస్తున్న తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి

అర్ధాంతరంగా వెనుదిరిగారు. చివరిగా మేము కోరిన పరిహారం చెల్లించకపోతే భూములు ఇచ్చేది లేదని, చట్టప్రకారం పోతామంటూ అధికారులు చెబితే బెదిరేది లేదని, న్యాయ పోరాటానికైనా సిద్ధపడతామని పలువురు రైతులు మీడియాతో పేర్కొన్నారు. రూ.4,676.50 కోట్లు ప్రాజెక్టు ఏర్పాటుకు ఖర్చు చేస్తుంటే ప్రాజెక్టుకు ప్రధాన ఆధారమైన 399 ఎకరాల పట్టా భూముల కొనుగోలుకు ఎకరం కనీసం రూ.24 లక్షల వంతున అయ్యే రూ.95.76 కోట్లు వెచ్చించలేరా అంటూ అన్నదాతలు తమ అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం.

# పదవులకే వన్నె తెచ్చిన మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి

### గల్లీ నుంచి ఢిల్లీకి అనుభవించిన పదవులు పలువురు నేతలు వెల్లడి
### అనంతలో ఘనంగా నీలం 113 వ జయంతి వేడుకలు





అనంతపురం లోని శ్రీకంఠం సర్కిల్ లో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యాలు

**అనంతపురం, మే 19, (ప్రభాతవార్త బ్యూరో)**
గల్లీ నుంచి ఢిల్లీ స్థాయికి ఎన్నో పదవులు అనుభవించాడని, దేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటిచెప్పిన వ్యక్తి నీలం సంజీవరెడ్డి అని ఎడిసిసి మాజీ ఛైర్మన్ తరిమెల కోనా రెడ్డి కొనియాడారు. మాజీ రాష్ట్రపతి దివంగత నీలం సంజీవరెడ్డి 113వ జయంతి సందర్భంగా అనంతపురం నగరంలోని శ్రీకంఠం సర్కిల్ లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ ఐడిసి మాజీ ఛైర్మన్ నల్లపరెడ్డి, అగ్రికల్చర్ అడ్వైజరీ మాజీఛైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, తదితర నీలం సంజీవరెడ్డి అభిమానులు సంజీవరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో సాగునీటి సౌకర్యాలకు ఎంతో కృషి చేశారని, రాజకీయ పదవులకు వన్నె తెచ్చిన వ్యక్తి నీలం సంజీవరెడ్డి అని తరిమెల కోనా రెడ్డి , నల్లపురెడ్డి, రామచంద్రారెడ్డి లు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు.పార్టీలో పిసిసి, ఎఐసిసి పదవులను అధిరోహించి. రాష్ట్ర మంత్రిగా , కేంద్ర మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా, లోక్ సభ స్పీకర్ గా, రాష్ట్రపతిగా పనిచేసి మచ్చలేని నాయకుడిగా తెలుగు ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పిన నేత నీలం అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. రైతు బిడ్డ రాష్ట్రపతి కావడం సాధారణమైన విషయం కానప్పటికీ....ఆ పదవిని ఏకగ్రీవంగా చేజిక్కించుకోవడం తెలుగుజాతికే గర్వకారణమన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయడంలో....... సామాన్య రైతు కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో రాణించడంతో.....గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఆయన ఎదిగిన తీరు నేటి యువతకు ఆదర్శప్రాయమని తెలిపారు. నేటి యువతీ యువకులు నీలం సంజీవరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా గార్లదిన్నె మండలం కల్లూరు లో మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి విగ్రహం వద్ద ఘనంగా సంజీవరెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అభిమానుల మధ్య కేక్ కూడా కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూడా ఎడిసి బ్యాంకు మాజీ అధ్యక్షులు కోనారెడ్డి, ఏపీఐడీసీ మాజీ ఛైర్మన్ నల్లపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కురుబ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే మంత్రి సవిత లక్ష్యం

### విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించి ప్రోత్సహించారు
### మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపిన కురుబ సంఘం నాయకులు





మాట్లాడుతున్న రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు , నియోజకవర్గం కురుబ సంఘ అధ్యక్షులు చర్లపల్లి రామకృష్ణ

**పెనుకొండ మే 17 ప్రభాతవార్త**
విద్యే సమాజ అభివృద్ధికి మూలమని కురుబ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలనే ఉద్దేశంతో మంత్రి సవిత అనంతపురంలోని లలిత కళాపరిషత్‌లో ఆదివారం కురుబ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కురుబ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో పాల్గొని 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంత్రి సవిత చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. అందుకు మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపేందుకు పట్టణంలోని టిడిపి అన్న క్యాంటీన్ కార్యాలయంలో మంగళవారం కురుబ సంఘం నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని కురుబ సామాజిక ప్రజల తరఫున మంత్రి సవితకు కృతజ్ఞతలతో కూడిన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, రాష్ట్ర కురుబ సంఘం ప్రచార కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కురుబ సంఘం కోశాధికారి గోరంట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ అధ్యక్షులు చెల్లాపల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షులు బండ్లపల్లి శివయ్య, ఎగువగడ్డ నంజుండ, వర్కింగ్ ప్రెసిడెంట్ చాకర్లపల్లి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు మహాదేవపల్లి ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, నియోజకవర్గ అధ్యక్షులు చెల్లాపల్లి రామకృష్ణ లు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు అందిస్తున్న సహకారం కు అభినందనీయమని తెలిపారు. మంత్రి సవిత కురుబల కోసం చేపడుతున్న కార్యక్రమాలను విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయ సంఘాలు, విద్యా సంఘాలు ఐక్యతతో ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాలల్లో 950 పైన మార్కులు సాధించిన 12 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేయడం అభినందనీయమని అదేవిదంగా ప్రభుత్వ పాఠశాలల్లో 580కు పైగా మార్కులు సాధించిన పదో తరగతి నలుగురు విద్యార్థులకు రూ.25 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. 508 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. ఇతర నాయకులు మాట్లాడుతూ కురుబల కోసం మంత్రి సవిత చేస్తున్న సేవలు అమోఘమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు సోమందేపల్లి సిద్దలింగప్ప, శివ, పెనుకొండ శంకర,రామచంద్ర, హరి, తదితరులు పాల్గొన్నారు.

# ఉరవకొండ నియోజకవర్గంలో.... అసంపూర్తీ సచివాలయాల పూర్తీకు రూ.9.61 కోట్లు నిధులు మంజూరు

### -నిధుల మంజూరుకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ

**ఉరవకొండ, మే 19 ప్రభాతవార్త**
ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోగల అసంపూర్తిగా ఉన్న 40 గ్రామ, వార్డు, సచివాలయాల నిర్మాణాల పూర్తికు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మం త్రి పయ్యావులకేశవ్ ప్రత్యేక చొరవతో రాష్ట్రప్రభుత్వం పురపాలక, గ్రామీణాభివృద్ధిశాఖ, అనంతపురం జిల్లా పురపాలక భవనాల గ్రాంటు 2026-27 కింద 9.61 కోట్ల రూపాయలు నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు ప్రత్యేక జీవో 430ను విడుదల చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే (ఎఫ్ఏసీ) ఉత్తర్వులు జారీ చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పీఆర్-బిల్డింగ్స్ గ్రాంటుకింద ఉరవకొండ నియోజకవర్గంలో 25.90 కోట్ల అంచనా వ్యయంతో అసంపూర్తిగా ఉన్న 153 ప్రభుత్వ భవనాలను పూర్తీ చేయడానికి నిధులు మంజూరు కోరుతూ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించి సచివాలయాల భవనాల పూర్తికు నిధులు విడుదలకై కోరగా ఈమేరకు జీవో విడుదలైంది. ఈక్రమంలోనే ఉరవకొండ మండలంలోని ఆమిద్యాల, చిన్న ముష్టూరు, లత్తవరం, షేక్షానుపల్లి, ఉరవకొండ-2,3,4,5, వెలిగొండ సచివాలయాలకు 2.43 కోట్లు మంజూరు అయ్యాయి. బెలుగుప్ప మండలంలోని ఎన్.గుండ్లపల్లి, బి.రామసాగరం, ఎర్రగుడి, నరసాపురం, హనిమిరెడ్డి పల్లి, బెలుగుప్ప-1 సచివాలయాలకు 1.49 కోట్లు, కూడేరు మండలంలోని ఇప్పేరు, మరుట్ల, ఉదిరిపికొండ సచివాలయాలకు 89 లక్షలు మంజూరు అయ్యాయి. విడపనకల్లు మండలంలోని చీకలగుర్కి, గడేకల్లు, హావళిగి-1,2, హంచనహాల్, కరకముక్కల, కొట్టాలపల్లి, పాల్తూరు-1,3, పొలికి, ఉండబండ, వేల్పుమడుగు, వి.కొత్తకోట, మాళాపురం, విడపనకల్లు-2 సచివాలయాలకు 3.10 కోట్ల రూపాయలు, వజ్రకరూరు మండలంలోని వ జ్రకరూరు-2, వెంకటాంపల్లి, గూళపాళ్యం, కొనకొండ్ల-3, రాగులపాడు సచివాలయాలకు 1.70 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయి.



రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

# ఆచార్య రాచపాలెంకు అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం





**అనంతపురము, మే 19 ప్రభాతవార్త బ్యూరో**
ప్రసిద్ధ అభ్యుదయకవి అడిగోపుల వెంకటరత్నం పేరుమీద ఆయన కుటుంబ సభ్యులు నెలకొల్పిన "అడిగోపుల సాహిత్య ప్రతిభా పురస్కారం 2026" కు సుప్రసిద్ధ అభ్యుదయ సాహిత్య విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు అవార్డు వ్యవస్థాపకులు, అడిగోపుల కుటుంబ సభ్యులు వెల్లడించారు. జులైనెల రెండవవారంలో తిరుపతిలో జరగనున్న ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని రాచపాలెంకు అందజేయనున్నట్లు ఆస్ట్రేలియా నుంచి "తెలుగుసందడి" సాహిత్య, సాంస్కృతిక వ్యవహారాల సంచాలకుడు అడిగోపుల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ, తెలుగు; పిహెచ్.డి (197077) చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, యోగివేమన విశ్వవిద్యాలయాలలో 38 ఏళ్ళు తెలుగు అధ్యాపకుడుగా పని చేశారు. 102 విమర్శ, పరిశోధన, కవిత్వ, సంపాదక పుస్తకాలు ప్రచురించారు. 45 మంది పరిశోధకులకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడుగా, నేషనల్ బుక్ ట్రస్ట్ తెలుగు సలహామండలి సభ్యుడుగా, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడిగా పని చేశారు. కేంద్రసాహిత్య అకాడమీ పురస్కారంతో పాటు 23 పురస్కారాలు అందుకున్నారు. అర్థ శతాబ్దకాలం సాహిత్య సేవలో 30 గ్రంథాలతో అభ్యుదయ కవిత్వాన్ని సమృద్ధి చేసిన "అడిగోపుల వెంకటరత్నం స్మారక పురస్కారాన్ని", తెలుగు సాహిత్య విమర్శను అర్థ శతాబ్దకాలం విస్తృతపరచిన ఆచార్య రాచపాలెంకు అందజేయడం సముచితంగా భావిస్తున్నామని అడిగోపుల శ్రీకాంత్ పేర్కొన్నారు. 50 సంవత్సరాలుగా మొక్కవోని దీక్షతో సాహిత్య విమర్శకు అంకితమైన ఆచార్య రాచపాలెం తెలుగు నేలంతా తెలిసిన విమర్శకులని అన్నారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను తనదైన భావజాలంతో నిరంతరం విశ్లేషించే రాచపాలెం ఎందరో యువ రచయితలకు ప్రోత్సాహమిస్తున్నారని తెలిపారు. ప్రాచీన కవిత్వం, ఆధునిక కవిత్వం, నవల, కథానిక, నాటకం, సాహిత్య విమర్శ, దాక్షిణాత్య సాహిత్యం, భారతీయ సాహిత్యం వంటి అనేక ముఖాలుగా తెలుగు సాహిత్య విమర్శను విస్తరింప చేస్తున్న విమర్శకులు రాచపాలెం ఈ పురస్కారానికి అన్ని విధాలా తగినవారని శ్రీకాంత్ వివరించారు. రాచపాలెం రచించిన "దరి దాపు" గ్రంథం ఎం.ఏ తెలుగు విద్యార్థులకు పాఠ్య గ్రంథమైందని, ఆచార్య హెచ్.ఎస్ బ్రహ్మానందతో కలిసి రచించిన "సాహిత్య బోధనా పద్ధతులు" సాహిత్య అధ్యాపకులకు, "సాహిత్య పరిశోధన సూత్రాలు" గ్రంథం సాహిత్య పరిశోధకులకు నిత్యం ఉపయోగంలో ఉన్నాయన్నారు. ఆయన పర్యవేక్షణలో 40 మంది విద్యార్థులు పరిశోధన చేశారని తెలిపారు. రాచపాలెం రచించిన "మన నవలలు మన కథానికలు" అనే గ్రంథానికి 2014లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించిందన్నారు. అంతటి ప్రసిద్ధ విమర్శకునికి అడిగోపుల పేరుతో పురస్కారం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీకాంత్ పేర్కొన్నారు.

# మంత్రిపైనే సోషల్ మీడియాలో పోస్టులు పెడతావా...! ఎంత ధైర్యంరా నీకు అంటూ దాడి...!

### హైకోర్టు లాయర్ పై మంత్రి అనుచరులదాడి.ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో ఘటనపై పోలీసులకు పిర్యాదు

**ధర్మవరం, మే 19, ప్రభాతవార్త**
రేయ్ ఎంత ధైర్యం రా మంత్రిపైనే సోషల్ మీడియాలో పోస్టులు పెడతావంటూ హైకోర్టు లాయర్ ఎంకేకాలువ అంజన్రెడ్డిపై మంత్రి అనుచరులు దాడి చేసి తీవ్రంగా గాయపరచిన సంఘటన మంగళవా రం ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో జరిగింది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలమేరకు ధర్మవరం మండలం తిప్పేపల్లి గ్రామానికి చెందిన ఎంకేకాలువ ఆంజన్రెడ్డి17 ఏళ్లగా హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. మంత్రిసత్యకుమార్ యాదవ్ పీఏ హరీశ్ బాబు, డ్రైవర్ ప్రవీణ్ కుమార్యాదవ్. ధర్మవరంకు చెందిన రమేశ్ యాదవ్, జూటూరు వెంకటేశ్, మరో ఇద్దరు యువకులు వచ్చారు. గతంలో హరీశ్ బాబు కొందరు వ్యక్తుల ద్వారా తెలియని నెంబరు నుండి ఫోన్ చేసి నీపై దాడి చేస్తామని బెదిరించారని. దీంతో అక్కడి నుండి వెళ్లిపోతుండగా ప్రవీణ్ యాదవ్ అంజన్ రెడ్డి ముందుకు వచ్చి నీపేరు అంజన్ రెడ్డి అని పరిచయం చేసుకునేలా వచ్చాడు. అవును మీరెవరు గుర్తుకు రాలేదని అంజన్ రెడ్డి అన్నారు. నాపేరు ప్రవీణ్ కుమార్ యాదవ్ నన్ను చూడదలేదు నాది కర్నూలు నువ్వు గుర్తు పట్టలేవు అంటూ అంజన్ రెడ్డి మెడపట్టుకుని జేబులో ఉన్న మొబైల్ లాక్కొని దాడిచేశారు. హరీశ్ బాబు, సూపరింటెండెంట్ వెనుకకు వెళ్లగా ఈ రోజు దొరికాడు చంపండి రా అంటూ అంజన్ రెడ్డి ముఖంపై గుద్దాడు. అంజన్ రెడ్డి కిందకు పడిపోగానే మిగిలినవారు దాడిచేశారు. సత్యకుమార్యాదవ్ కు సరిగా పనిచేయలేదని సోషల్ మీడియాలో పోస్టు పెట్టానని చంపడానికి ప్రయత్నించారని అంజన్ రెడ్డి పిర్యాదులో పేర్కొన్నట్టు పోలీసులు తెలిపారు.దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాది ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఆయన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



మంత్రి అనుచరుల దాడిలో గాయపడిన హైకోర్టు లాయర్ ఎంకే కాలువ అంజన్ రెడ్డి

## ఏడాది పాటు బంగారం కొనవద్దన్న ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యలు వెనక తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న జువెలరీ షాప్ యజమానులు

రాయదుర్గం మే 19 ప్రభాతవార్త

ఏడాది పాటు బంగారం కొనవద్దన్న భారత ప్రధాని నరేంద్ర మోడీ వ్యాఖ్యాలు వెనక్కి తీసుకోవాలని రాయదుర్గం స్వర్ణకారులు జువెలరీ షాప్ యజమానులు డిమాండ్ చేశారు ఈ మేరకు మంగళవారం రాయదుర్గం పట్టణంలో జువెలరీ షాప్ యూనియన్ అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో స్వర్ణకారులు బంగారు షాప్ యజమానులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వినాయక సర్కిల్ నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కు వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా బంగారు షాపు యజమానులు మాట్లాడుతూ ఒక దేశ ప్రధాని ఇలా మాట్లాడడం సరికాదని ఏడాది పాటు బంగారు కొనవద్దని ప్రజలకు సూచించిన మాటలు సరికాదన్నారు స్వర్ణకారుల కడుపు కొట్టడమేనని స్వర్ణకారులు, జువెలరీ షాప్ యజమానులు మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం గోల్డ్ షాపులు బంద్ చేసి నిరసనలు చేపట్టారు. స్వర్ణకారులు, గోల్డ్ షాపు యజమానులు తమ షాపులు బంద్ చేసి నిరసన ర్యాలీ చేపట్టారు. వినాయక కూడలిలో పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రధాని మోడీ వాఖ్యలను నిరసించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించి తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. అసోషియేషన్ నాయకులు గోల్డ్ ఘని, కంసల నాగరాజు, ఆరుణ్ బాష, ఇబ్రహీం, ఇస్మాయిల్, ఓంకారాచారి స్వర్ణ కారులు, గోల్డ్ షాపు యజమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రధాని వాఖ్యలతో దేశవ్యాప్తంగా మూడున్నర కోట్ల మంది వీధిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు

## ఆరోగ్య సమస్య అప్పు తీర్చలేక వ్యక్తి మృతి

బ్రమ్మాసముద్రం మే 19 ప్రభాతవార్త

బ్రహ్మ సముద్రం మండలం వేపులపర్తి గ్రామస్తుడైన శివన్న, వయస్సు 45 సం,, లు, తండ్రి లేట్ రంగప్ప సుమారు ఒక సంవత్సరం నుండి పైల్స్ ఇంటి అవసరాలుకు చేసిన అప్పులు తీర్చలేక మంగళవారం 19 వ తేదీన 9.00 గంటలకు పోలేపల్లి గ్రామములో తన బందువుల ఇంటి నుండి బహిర్భూమి కి అని చెప్పి వెళ్ళి కొద్దిసేపటి పోలేపల్లి గ్రామస్తులు శివన్న గ్రామ శివారులో అపస్మారక స్థితిలో పడి ఉండగా అతనని వాహనములో చికిత్స కోసం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొనిపోగా డాక్టర్ పరీక్షించి చనిపోయినాడు అని శివన్న భార్య అయిన భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికుమార్ తెలిపారు.

## ప్రజా వేదికలో జాబ్ మేళాకు విశేష స్పందన

20 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు

కల్పించిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మే 19 ప్రభాతవార్త



జాబ్ మేళాలో అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కళ్యాణదుర్గం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయం ప్రజా వేదికలో నిర్వహించిన జాబ్ మేళా విశేష స్పందనను అందుకుంది. స్థానిక శాసనసభ్యులు అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్ర మంలో బెంగళూరుకు చెందిన ఎమ్‌కే ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వ హించారు. జాబ్ మేళాకు పెద్ద సంఖ్యలో యువకులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించగా, ఎంపిక ప్రక్రియ అనంతరం 20 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన వారికి బెంగళూరు లో ఉద్యోగంతో పాటు వసతి సౌకర్యం కల్పించబడుతుందని, ప్రతి నెల రూ.20 వేల వేతనం అందించనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగ అవకాశాలు పొందిన యువకులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమ భవిష్యత్తు కు బాటలు వేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. యువత ఉపాధి కోసం ప్రజా వేదికను వేదికగా మార్చి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## అనుమతులు, అర్హతలేని సుభాని మొలల క్లీనిక్ సీజ్..!

-ఆకస్మిక తనిఖీచేసి చర్యలు తీసుకున్న

డీఎంహెచ్‌వో డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి





ఉరవకొండలో సీజ్ చేసిన సుభానీ మొలల క్లీనిక్



క్లీనిక్ నిర్వాహకుడు సుభాన్‌కు నోటీసు అందిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి

ఉరవకొండ, మే 19 ప్రభాతవార్త

ఉరవకొండ పట్టణంలోని స్థానిక ఆదిఆంధ్ర పాఠశాలవద్దగల ఎలాంటి అనుమతులు, అర్హత లేకుండా నిర్వహిస్తున్న సుభానీ మొలలు క్లీనిక్‌ను మంగళవారం సాయంత్రం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి సీజ్ చేశారు. సదరు మొలలు క్లీనిక్‌లో వైద్యం చేయించుకున్న ఒక మహిళా రోగి మృతి చెందిన ఘటన వెలుగులోకి రావడంతో జిల్లా వైద్యాధికారి స్పందించారు. ఈక్రమంలోనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి ఇ.నాగరాజు, డిప్యూటీ మాస్ మీడియా అధికారి లక్ష్మీనారాయణ, స్థానిక ప్రభుత్వాసుపత్రి పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ వినీత బృందం మొలల క్లీనిక్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతులు, అర్హతలు లేకుండా చట్ట విరుద్ధంగా ప్రజారోగ్యాన్ని దెబ్బతీసేలా క్లీనిక్ నిర్వహిస్తున్నారని గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అర్హతలు లేకుండా అల్లోపతి వైద్యం అందిస్తూ ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రథమ చికిత్స కేంద్రమని పేరుపెట్టి వైద్యం అందించడం, గ్లూకోజ్ ఎక్కించడం, యాంటీబయాటిక్స్ వాడటం, శస్త్ర చికిత్సలు చేయడం నేరమన్నారు. అలాంటి వారిపై నిఘా ఉంటుందని పిర్యాదు అందితే క్లీనిక్‌లను మూసివేసి నిర్వాహకులపై చట్టబద్ధ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## రైలు కిందపడి వృద్ధురాలు ఆత్మహత్య



గుత్తి, మే 19 ప్రభాతవార్త

గుత్తి జీఆర్‌పి పరిధిలోని రాయలచెరువు - జక్కలచెరువు స్టేషన్ల నడుమ మంగళవారం 65

రైలు కిందపడి వృద్ధురాలు మరణించిన దృశ్యం

సంవత్సరాల గుర్తుతెలియని వృద్ధురాలు గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. మృతురాలు తెలుపు ఎరుపు రంగు చీర, ఎరుపు రంగు జాకెట్, మణికట్టుపై కళ్ళు గుర్తు ఉన్న పచ్చబొట్టు, కుడి చేయి బొటన వేలుపై స్వస్తిక్ గుర్తు ఉన్న పచ్చబొట్లు ఉందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిసినవారు 7815865689కు సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పునర్విభజనపై జియోగ్రాఫికల్ మ్యాప్ ఇవ్వండి

కమిషనర్ ను కోరిన వైసిపి



సమీక్ష చేస్తున్న వేణురెడ్డి

హిందూపురం మే 19 ప్రభాతవార్త



కమిషనర్ కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మున్సిపల్ వార్డుల ను పునర్విభజన చేస్తూ 52 కు పెంచిన క్రమంలో భౌగోళికంగా విభజించిన మ్యాపులను ఇవ్వాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కోరారు. పరిశీలించి ఏ విషయం తర్వాత చెబుతానని కమిషనర్ వారికి బదులిచ్చారు. అంతకు ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దీపిక కార్యాలయంలో పార్టీ నేత వేణురెడ్డి అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. వార్డుల పునర్విభజన చేస్తూ అధికారులు విడుదల చేసిన జాబితా పై పార్టీ నాయకులు చర్చించారు. సర్వేనెంబర్ డోర్ నెంబర్లు ఆధారంగా 13 పేజీల జాబితా విడుదల చేసినప్పటికీ భౌగోళికంగా విభజన ప్రక్రియ మ్యాప్ ఆధారాలను చూస్తేనే పూర్తిగా అవగాహన వస్తుందని ఈ సందర్భంగా వారు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జేబివుల్లా, మాజీ కౌన్సిలర్లు శివకుమార్ ఆసిఫ్, పట్టణ యువజన విభాగం అధ్యక్షులు మనోజ్ మింటూ, రాష్ట్ర మైనారిటీ విభాగం సంయుక్త కార్యదర్శి ఫారుక్, తిమ్మారెడ్డి, రహమత్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో మట్టి ఇసుక తవ్వకంలో వివాదం! పట్టించుకోని అధికారులు! ..

వీఆర్వో ఫిర్యాదుతో పర్యవేక్షిస్తున్న పోలీసులు

అమరాపురం మే 19 ప్రభాతవార్త



పరిశీలిస్తున్న పోలీసులు దృశ్యం

మండల పరిధిలోని హాలుకూరు పెద్ద చెరువులో మట్టి ఇసుక త్రవ్వకాలు జరుగుతున్నట్లు స్థానిక వీఆర్వో ద్వారా పోలీసులకు ఫిర్యాదు ఉండడంతో పోలీసులు చెరువు ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించారు. చెరువులో మట్టి తోలడం ద్వారా గుంతల మయం చేసి అదేవిధంగా ఇసుకను తోలుతున్నారని సమాచారం. అది కూడా ఒక్కొక్క ట్రాక్టర్ లోడు 4వేల నుంచి 5వేల వరకు కూడా అమ్ముకున్నట్టు అధికారులకు సమాచారం అందింది. అయితే సంబంధిత అధికారులు నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విచ్చలవిడిగా చెరువులో ఇసుకను తోలుతున్నారని ముఖ్యంగా స్థానికంగా ఉన్న వివాదం మట్టి మరియు ఇసుక తోలడం వరకు వచ్చినది. సంబంధించిన అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని స్థానిక ప్రజలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధించిన అధికారులు ఇసుకను తోలుతున్నటువంటి వ్యక్తులపైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆరా తీస్తున్నారు. దీనిపై స్థానిక పోలీసులు చెరువును పరిశీలించారు. రైతులు తమ తోటలకు మట్టితోలుకొనే సమయంలో ఎలాంటి వివాదం రాలేదని ప్రస్తుతం కొందరు ఇసుకను అనుమతి లేకుండా తోలడం ద్వారా వివాదం తలెత్తినట్లు గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు.

## బడి బాటలో విద్యార్థుల నమోదు డ్రైవ్

కనేకల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించిన

ప్రధానోపాధ్యాయులు మాబు సాహెబ్

కనేకల్, మే 19 : ప్రభాతవార్త



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం

అనంతపురం జిల్లా కలెక్టర్ మరియు మండల విద్యాధికారుల ఆదేశాల మేరకు కనేకల్ గ్రామంలోని మండల ప్రాథమిక బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాబు సాహెబ్ ఆధ్వర్యంలో స్టూడెంట్ ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను కూరాకుల వీధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాబు సాహెబ్ తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఇతర సౌకర్యాల గురించి వివరించారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యార్థుల నమోదు పెంపుదలకు ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ప్రవేశాల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈనెల 25 నుంచి జూన్ 4 వరకు పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు..

మన మిత్ర వాట్సప్ ద్వారా హాల్ టికెట్స్ డౌన్లోడ్ చేసుకోండి

కొత్తచెరువు మే 19 ప్రభాతవార్త.

శ్రీసత్యసాయి జిల్లాలో అన్ని గుర్తింపు పొందిన యాజమాన్యాల పాఠశాల ల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయడమేమనగా మే 25వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించబడతాయని డీఈవో జీ కృష్ణప్ప తెలిపారు ఇందుకు సంబంధించిన హాల్‌టికెట్లు మనమిత్ర 9552300009 మొబైల్ నెంబర్‌కి హాయ్‌అని పంపండి సేవలను ఎంచుకోండి పై క్లిక్ చేయండి విద్యా సేవలు ఎంచుకోండి ఏఎస్‌సి 2026 హాల్ టికెట్ ఎంచుకోండి అనంతరం ఎస్ఎస్సి మార్చి 2026 రోల్ నెంబర్ మరియు డేట్ అఫ్ బర్త్ నమోదు చేయండి కన్ఫర్మ్ పై క్లిక్ చేయండి హాల్ టికెట్స్ డౌన్లోడ్ అవుతుంది లేదా బిఎస్సి ఏపీ వారి అధికారిక వెబ్సైట్ www.bsc.gov.in ద్వారా కూడా పొందవచ్చని డీఈవో తెలిపారు.

## మానేపల్లిలో టిడిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశం

- గ్రామాల్లో మరచిన అభివృద్ధిపై సమీక్ష

- స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాలి

- ఎమ్మెల్యే పిఏ డాక్టర్ సురేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ అభిలాష్

లేపాక్షి, మే 19 ప్రభాతవార్త

మండల పరిధిలోని మానేపల్లిలో మంగళవారం టిడిపి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. టిడిపి మండల టిడిపి కన్వీనర్ అభిలాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిఏ డాక్టర్ సురేంద్ర, నియోజకవర్గ టిడిపి కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏపీటీడీసీ డైరెక్టర్ జయప్ప, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద్‌కుమార్‌లు పలు విషయాలపై చర్చించారు. మానేపల్లి, సిరివరం పంచాయతీల టిడిపి నేతలతో జరిగిన సమావేశంలో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను, జరగవలసిన పనులపై చర్చించారు. గ్రామాల అభివృద్ధితో పాటు తెలుగుదేశం పార్టీ అభివృద్ధిపై టిడిపి నాయకులు దృష్టి సారించాలన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల చెంతకు టిడిపి ఆశయాలను తీసుకువెళ్లాలని సూచించారు. అదేవిధంగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో పట్టున్న నాయకులను పోటీ చేసే విధంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మారుతిప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కిష్టప్ప, సిరివరం చెరువు సంఘం అధ్యక్షులు ఆవులరెడ్డి, నాయకులు వెంకటప్ప, బాబా, రఘు, రంగనాథ్, మూర్తి, రెడ్డప్ప, జాకీర్, నారాయణప్ప, రామచంద్ర, విజయ్, రఘునాథ్, భాస్కర్‌రెడ్డి, గంగాధరప్ప, హనుమంతప్ప, మూర్తి, శంకరప్ప, సోములతో పాటు అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంచాయతీ నిధుల కొరతతో నిలిచిపోయిన ఫిల్టర్ వాటర్ సేవలు

ఫిల్టర్ వాటర్ ఎప్పుడు రిపేర్ చేస్తారు..?

అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

కనేకల్ మే 19 ప్రభాతవార్త



వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు త్రాగునీటి అవసరం ఎంత ముఖ్యమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలు బయట త్రాగునీరు కొనుగోలు చేయలేక కనేకల్ పట్టణంలోని గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఫిల్టర్ వాటర్ కేంద్రంపై ఆధారపడుతూ వచ్చారు.అయితే, గత కొన్ని నెలలుగా ఈ ఫిల్టర్ వాటర్ కేంద్రం పనిచేయకుండా మూతపడిపోయి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై గ్రామపంచాయతీ ఇన్‌చార్జ్ అధికారిని ప్రశ్నించగా, పంచాయతీ వద్ద నిధులు లేవని, నిధులు వచ్చిన వెంటనే మరమ్మతులు చేపడతామని తెలిపారు.కానీ వేసవి కాలంలో త్రాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న నిరుపేదల పరిస్థితిని ఎవరు పట్టించుకుంటారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస అవసరమైన త్రాగునీటి సదుపాయం కల్పించడంలో గ్రామపంచాయతీ విఫలమైందని విమర్శిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అవసరమైన నిధులను సమకూర్చి ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను తక్షణమే మరమ్మతు చేయించి ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటి సౌకర్యం అందించాలని కనేకల్ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## మద్యం మత్తులో...నవీన్ ఉరి వేసుకుని ఆత్మహత్య..!!

- తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గోరంట్ల పోలీసులు

గోరంట్ల, మే 19 ప్రభాతవార్త



మృతిచెందిన నవీన్

తాగుడుకు బానిసై కుటుంబంలో జరిగిన చిన్నపాటి గొడవతో క్షణికావేశానికిలోనై ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గోరంట్ల పట్టణంలోని హరిజనవాడలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ సంఘటనలో కర్ణాటక రాష్ట్రంలోని మార్గానికుంట గ్రామానికి చెందిన మాల అనిల్‌కుమార్ (38) మృతి చెందాడు. వివరాలు ఇలా వున్నాయి. మృతుడు అనిల్‌కుమార్ భార్య గత మూడేళ్ల క్రితం చనిపోవడంతో గోరంట్ల పట్టణానికి వలస వచ్చి మరో మహిళతో సహజీవనం చేసుకుంటూ కుటుంబజీవనం కోసం భవన నిర్మాణ కార్మికునిగా పనికి వెళుతుండేవాడని స్థానికులు తెలిపారు. అయితే ఇటీవల కొంతకాలంగా మద్యానికి బానిసై తనతో పాటు సహజీవనం చేస్తున్న మహిళతో సైతం సఖ్యత లేకుండా ఘర్షణ పడేవాడని ఇందులో భాగంగానే సోమవారం సాయంత్రం జరిగిన చిన్నపాటి గొడవకు మనస్థాపం చెంది తన నివాసంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రామచంద్ర సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండకు తరలించినట్లు తెలిపారు. తన కుమారుడు మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి మాల ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## నేడు లక్ష్మినరసింహస్వామి ఆలయంలో హుండీల లెక్కింపు

-ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు

ఉరవకొండ, మే 19 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ఆలయ ఈవో సాకే రమేష్‌బాబు

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ఈనెల 20వ తేదీ (నేడు) బుధవారం ఉదయం 9 గంటలకు హుండీల లెక్కింపు జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ముందు గత నెల 13వ తేదీ నుండి స్వామి వారికి హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో లెక్కించడం జరుగుతుందన్నారు.

## మోపిడి గ్రామంలో రైతు ఆత్మహత్య

-తన పొలంలోనే పురుగుల మందు తాగి మృతి

-నాలుగు రోజుల తరువాత వెలుగులోకి ఘటన

-వ్యవసాయం కోసం అప్పులే కారణమన్న కుటుంబం

ఉరవకొండ, మే 19 ప్రభాతవార్త



పురుగుల మంది తాగి ఆత్మహత్య చేసుకున్న బోయ గొర్ల జయప్ప



గొర్ల జయప్ప (ఫైల్‌ఫోటో)

మండల పరిధిలోని మోపిడి గ్రామంలో బోయ గొర్ల జయప్ప (70) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలోని ప్రధాన రహదారికి పక్కనగల తన సొంత పొలంలోనే పురుగుల మందు తాగి మృతి చెందగా నాలుగు రోజుల తరువాత ఘటన వెలుగు చూసింది. వ్యవసాయం కోసం చేసిన అప్పులే ఆత్మహత్యకు కారణమని కుటుంబ సభ్యులు తెలిపారు. సీఐ బి.మహానంది తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే...గ్రామంలో తనకున్న 4.4 ఎకరాల భూమిలో వేరుశెనగ తదితర పంటలు సాగు చేస్తూ గొర్ల జయప్ప జీవనం సాగిస్తున్నాడని సమాచారం. అయితే ఇటీవలి కాలంలో వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో 5 లక్షల రూపాయల అప్పులు పెరిగిపోయి ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో నిత్యం మదనపడే వాడని తెలిసింది. ఈక్రమంలోనే ఈనెల 16వ తేదీన శనివారం ఇంటి బయటకు వెళ్లిన ఆయన తన పొలానికి వెళ్లి అక్కడే పురుగుల మందుతాగి మృతి చెందాడు. అయితే కుళ్లిన వాసన వస్తుండటంతో పొలానికి వెళ్లి చూడగా గొర్ల జయప్ప మృతదేహాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి ఆసుపత్రికి తరలించేందుకు వీలుకాని విధంగా ఉబ్బిపోయి ఉండటంతో కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ప్రభుత్వ వైద్యులతో అక్కడ శవ పరీక్షలు పూర్తి చేయించారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కొడుకులు హనుమంతరాయుడు, శ్రీనివాసులు, కుమార్తె ఉన్నారు.

## జలధారజలహారతి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి, మే 19, ప్రభాతవార్త

జల ధర జలహారతి లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్టానిక కలెక్టరేట్ లోని వీడియో కన్ఫారెన్స్ హాల్ నందు మడకశిర క్లస్టర్ నందు అగలి,అమరాపురం, గుడిబండ మరియు మడకశిర మండలాల సిబ్బంది అయినా ఇరిగేషన్ ఏఈలు ఉపాధి హామీ ఎపిడిలు ,ఎంపిడిఓ, ఏపిఓలు,అందరూ ఇంజనీరింగ్ సహాయకుడు లతో సమావేశం నిర్వహించి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘జలధార జలహారతి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలాల ప్రగతి పై అధికారులకు దిశా నిర్దేశము చేసి ప్రగతిలో వెనకంజలో ఉన్న మండలాల వారికి మందలించారు. ఖిజలధారజలహారతిఖి పనులు వేగవంతం చేయాలని అలాగే మొబైల్ యాప్‌ను వినియోగించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ఎంపీడీఓలు , ఏపీఓలు పనిచేయాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి పంచాయతీలో పనులు జరిగేలా చూడాలని, పని ప్రదేశాల్లో కూలీలకు అవసరమైన ..నీడ, తాగునీరు మరియు మెడికల్ కిట్లను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.నిర్దేశించిన టార్గెట్ మేరకు ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ గారు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో డిడబ్ల్యుఎంఏ పిడి విజయప్రసాద్ ప్రసాద్, నీటిపారుదల అధికారులు పాల్గొన్నారు.

## కిషోరీ బాలికల చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్డిటి సీవో రామకృష్ణ.

కనగానపల్లి మే 19 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ స్కూల్ నందు సోమవారం ఆర్డిటి ఆధ్వర్యంలో కిషోరీ బాలికలకు చట్టాలపై అవగాహ న కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి సీవో రామకృష్ణ, బాల బాలికలు పాల్గొన్నారు.

## చరణన్న నిండు నూరేళ్లు చల్లగా ఉండన్నా

- గోరంట్లలో...మాజీ మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి బర్త్‌డే వేడుకలు - మండల కన్వీనర్ వెంకటేష్, పట్టణ కన్వీనర్ మేదర్ శంకర్ ఆధ్వర్యంలో సంబరాలు

గోరంట్ల, మే 19 ప్రభాతవార్త



జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న వైసీపీ నేతలు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత, మాజీ మంత్రి, శ్రీ సత్యసాయి జిల్లా వైసిపి అధ్యక్షురాలు ఉషశ్రీ భర్త చరణ్ రెడ్డి జన్మదినం వేడుకలను మంగళవారం గోరంట్ల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గోరంట్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు పగడాల వెంకటేష్, పట్టణ అధ్యక్షులు మేదర శంకర ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిలో గల మేదర శంకర ఇంటి సమీపంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులు మండల జెడ్‌పిటిసి పాతే జయరాంనాయక్, ఎంపిపి ప్రమీలమూర్తి, ఎంపిటీసీ సోమశేఖర్, సర్పంచు గంగాధర్, వైస్ ఎంపిపి కురవ సత్యనారాయణ, సురేందర్‌రెడ్డి, కలగేరి రామకృష్ణారెడ్డి, ఖాన్ బ్రదర్స్, మల్లికార్జునరెడ్డి తదితరుల నేతృత్వంలో ప్రత్యేకంగా తయారు చేయించిన కేకును కట్ చేసి పలువురికి పంచి పెడుతూ తన అభిమాన నేత చరణ్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మినారాయణరెడ్డి (లచ్చి), మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

## విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం ప్రతి విద్యార్థి కల

అనంతపురం న్యూటౌన్, మే 19 ప్రభాతవార్త

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించడం ప్రతి విద్యార్థి కల అని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమము, సాధికార అధికారి ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. లక్ష్యాన్ని సాధించేందుకు భారత ప్రభుత్వం సామాజక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ ఓవర్సీస్ స్కాలర్షిప్ స్కీమ్‌ను కేంద్ర రంగ పథకంగా ద్వారా అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాలు, డీనోటిఫైడ్ నోమాడిక్, సెమీనోమాడికి తెగలు, భూమిలేని వ్యవసాయ కార్మికులు మరియు సంప్రదాయ కళాకారుల వర్గాలకు చెందిన తక్కువ ఆదాయ విద్యార్థులకు విదేశాలలోని ప్రపంచ టాప్500 విశ్వవి ద్యాలయాలలో మాస్టర్స్ లేదా పిహెచ్ఐ చదువులు కొనసాగించేందుకు ఆర్థిక సహాయం అందించబడుతుంది. ప్రతి సంవత్సరం ఈ పథకం కింద 125 కొత్త స్కాలర్షిప్లు మంజూరు చేయబడతాయి. ప్రతి రాష్ట్రం/కేంద్ర పాలిత ప్రాంతానికి మొత్తం సీట్లలో గరిష్టంగా 10 శాతం పరిమితి అమలులో ఉంటుంది. ద్వారా 2026-27 ఎంపిక సంవత్సరానికి సంబంధించిన మార్గదర్శకాలు వెబ్‌సైట్‌లో విడుదల చేయబడినవి. ఖాళీల భర్తీ కోసం వెబ్ పోర్టల్లో తొలి దశ దరఖాస్తులు స్వీకరించబడుతున్నాయి. అర్హులైన అభ్యర్థులు 02-06-2026 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో సవరణలు చేసుకునేందుకు 04-06-2026 నుండి 07-06-2026 వరకు మరోసారి పోర్టల్ అందుబాటులో కలదు. దరఖాస్తులు, పూర్తి వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌లో అర్హులైన మరియు ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు.

## ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య 41 వర్ధంతి !

రాప్తాడు, మే 19 ప్రభాతవార్త

మండల కేంద్రంలో సోమవారం హమాలీ కార్మికులతో సుందరయ్య 41 వర్ధంతి బ్రహ్మయ్య అధ్యక్షతన జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాల రంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి.రామాంజనేయులు మాట్లాడుతూ.. పొదుపు గురించి పాలకుల విన్యాసాలు చూస్తుంటే ఈ సమయంలో సుందరయ్య మన మధ్య వుంటే ఎలా వుండేది అన్పిస్తున్నది. ప్రధానమంత్రి మోడీ, ఆయన అడుగుజాడల్లో నడిచే అనేకమంది ముఖ్యమంత్రులు పొదుపు మంత్రం జపించడం చూస్తే, పొదుపుపై వీరికి అకస్మాత్తుగా ఇంత సదభిప్రాయం, ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చాయా అని ఆశ్చర్యం కల్గకమానదు. పాలకుల మాటల వెనక మర్మాలు సుందరయ్య జీవితాన్ని, ఆయన ఆలోచనా సరళిని అర్థం చేసుకుంటే మనకు ఇట్టే అర్థం అయిపోతాయి. ఈ నెల పదవ తేదీన హైదరాబాద్‌లో పొదుపు చర్యల గురించి ప్రధానమంత్రి, అనాలోచితంగానో, పొదుపు మీద ప్రేమకోనో మాట్లాడలేదు. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించడానికి, చేయబోయే భారాలకు ప్రజలను సన్నద్ధం చేయడానికి, అందుకవసరమైన సాకులను చూపడానికే ప్రస్తావించారు. రోజులు తిరక్కుండానే వారి పొదుపు మాటల వెనకనున్న మోసం బయటపడింది. డీజిల్, పెట్రోల్ ధరలు మూడు రూపాయలు పెంచారు. ఇప్పుడు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ అనంతపురం సభ్యులు పోతలయ్య సుబ్బారావు, లక్ష్మమన్న, మల్లేష్, మధు ప్రసాద్, నారాయణస్వామి, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.



పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

## ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను సస్పెన్షన్ చేయాలి

### - జివిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్ డిమాండ్

అనంతపురం సిటీ, మే 19 ప్రభాతవార్త

.ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ విచ్చల విడిగా మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేయించిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డిని సస్పెన్షన్ చేయాలని జివిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ నాయక్ డిమాండ్ చేశారు. గుంతకల్లు మండలానికి చెందిన రైతు రామచంద్రానాయక్ గుంతకల్లులో లక్కీ వైన్‌షాప్ వద్ద మద్యం సేవించడానికి వెళ్లి పర్మిట్ రూమ్ వద్ద జారిపడి గాయపడ్డ ఘటనపై ఎక్సైజ్ అధికారులను జివిఎస్ఎస్ నేతలు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ నాయక్ మాట్లాడుతూ.. మద్యం దుఖానాల వద్ద అనధికారికంగా ఇష్టా రాజ్యంగా పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసిన ఎక్సైజ్ అధికారులు అవినీతి కో సం వాటిని పట్టించు కోవడం లేదన్నారు. గుంతకల్లు లక్కీ వైన్‌షాప్ వద్ద నిబంధనలకు విరుద్దంగా మేడపైన పర్మిట్ రూమ్‌ను ఏర్పాటు చేయడం వల్లే రైతు రామచంద్ర నాయక్ కిందికి వచ్చే క్రమంలో జారిపడి తలకు తీవ్ర గాయం అయిందన్నారు. అయినప్పటికీ మద్యం దుకాణం వారు కనీసం బాధితుడిని పట్టిం చు కోలేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన మద్యం దుకా ణా దారులతోపాటు, వీటిని ప్రో త్సహించిన ఎక్సైజ్ సూపరిం టెండెంట్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిపిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ధనుంజయ్‌నాయక్, జివిఎస్ఎస్ జిల్లా అధ్యక్షులు ధనుంజయ్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న జివిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్ నాయక్

## గిరిజనుల ప్రాణాలంటే అంత నిర్లక్ష్యమా..

### - మద్యం దుకాణం వద్ద పడిపోతే కనీసం స్పందించరా
### - వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్

అనంతపురం సిటీ, మే 19 ప్రభాతవార్త

గిరిజనుల ప్రాణాలు అంటే అంత నిర్లక్ష్యమా అని మద్యం దుకానం వద్ద జారిపడి తీవ్రంగా గాయపడిన కనీసం ఆసుపత్రికి కూడా తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్, విమర్శించారు. జిల్లా వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గుంతకల్లు మద్యం దుకాణంలో రైతు రామచంద్రనాయక్ మెట్లపై నుంచి జారిపడితే కనీసం మద్యం దుకాణం సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి కూడా తరలించ లేదన్నారు. దీంతో బాధితుని పరిస్థితి విషమించి నేడు ఆసుపత్రిలో ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. గిరిజన రైతు రామచంద్రానాయక్ గాయపడేందుకు కారణమైన మద్యం దుకాణాన్ని సీజ్ చేయాలని ఆసుపత్రికి తరలించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితుడికి మెరుగైన చికిత్స అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైసిపి ఎస్టీ సెల్ విభాగంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజునాయక్, నగర ప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్

## కదిరి మున్సిపల్ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్

కదిరి, మే 19 ప్రభాతవార్త

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ ఆర్‌టి ఎన్ఓ 606) ప్రకారం సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్ మంగళవారం కదిరి మున్సిపల్ ప్రత్యేక అధికారిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చ ఏపట్టిన జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ సందీప్, మున్సిపల్ సిబ్బంది మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక వసతులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిరంతరం పర్యవేక్షిస్తామని, ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకు రావాలని సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కదిరి పట్టణ అభివృద్ధి, పరిశుభ్రత కోసం ప్రజలందరూ మున్సిపల్ యంత్రాంగానికి సహకరించాలని, మున్సిపల్ ప్రత్యేక అధికారి మౌర్య భరద్వాజ్ కోరారు.



ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

## కిశోర వికాసం-బాల బాలికల సంరక్షణ అందరి బాధ్యత

నంబులపూలకుంట, మే 19 ప్రభాతవార్త

కిషోర్ వికాసం బాల బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని ఐసిడిఎస్ సూపర్వైజర్ సి.నరసమ్మ పేర్కొన్నారు. మంగళవారం 19/05/2026 తారీఖు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వారి, జిల్లా కలెక్టర్ శ్రీసత్య సాయి జిల్లా పిడి, సిడిపిఓ ఆదేశాల మేరకు కిషోర్ వికాసం వేసవి ప్రత్యేక ప్రచారంలో భాగంగా మే 1వ తారీఖు నుండి జూన్ 12 వరకు నిర్వహించబడిన కార్యక్రమంలో భాగంగా ఎన్‌పి కుంట సెక్టార్ ఎంపీ కుంట-1 అంగన్వాడి సెంటర్‌లో కిశోరీ వికాసం సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ఉద్దేశం 11-18 సంవత్సరాల మధ్య వయసుగల కిశోరీల సాధికారతే ప్రధాన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగింది అన్నారు. విద్య ఆరోగ్యం వ్యక్తిగత పరిశుభ్రత పోషణ బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన, సైబరు భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త కే శోభ హెల్పర్ సల్మా కిషోర్ బాలికలు పాల్గొన్నారు.



కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

## పేలుడు ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక సాయం అందజేత

కదిరి, మే 19 ప్రభాతవార్త

కదిరి రూరల్ మండలంలోని కుమ్మరవాండ్ల పల్లిలో గత నెల 15న జిలిటిక్స్ పేలి నలుగురు మృత్యువాత పడి, 17 మంది గాయాలతో బయట పడ్డారు. మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ భరోసా ఇచ్చి ఒక్కొ కుటుంబానికి రూ.ఐదు లక్షల రూపాయలు చొప్పున నలుగురు కుటుంబ సభ్యులకు 20 లక్షల ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని మంజూరు చేసినట్లు వెల్లడించారు. మంజూరైన ఆర్థిక సాయాన్ని మంగళవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మాబున్నీసా, విశ్వనాథ్‌రెడ్డి, అస్లాం బాషా, మధుసూధన్ కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వివిఎస్ శర్మ, తహశీల్దారు రెడ్డి శేఖర్, ఆర్ఐ విజయ్‌కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, రూరల్ కన్వీనర్ హరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

## బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కింపు

తాడిపత్రిటౌన్, మే 19 ప్రభాతవార్త

తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన హుండీని మంగళవారం లెక్కించారు. పర్యవేక్షణ అధికారి బి.అక్కిరెడ్డి, ఆలయ ఇఓ సి.రామాంజనేయులు ఆధ్వర్యంలో హుండీని లెక్కించారు. భక్తులు స్వామివారికి కానుకల రూపంలో సమర్పించిన 8 నెలల కాలానికి సంబంధించి హుండీని లెక్కించగా మొత్తం 7,03,050 రూపాయల ఆదాయం సమకూరింది.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథ్‌రెడ్డి, ఆలయ అర్చకులు, మహిళా సేవా కర్తలు పాల్గొన్నారు. భక్తులు సమర్పించిన కానుకలను పారదర్శకంగా లెక్కించి రికార్డుల్లో నమోదు చేశారు.



హుండీ మొత్తాన్ని లెక్కిస్తున్న దృశ్యం

## ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సదుపాయాల కల్పన

### - విశాలమైన తరగతి గదులు, నాణ్యమైన బోధన, విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందజేత
### - ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచేందుకు బడి పిలుస్తోంది కార్యక్రమం అమలు
### - ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ముందుకు వస్తున్న విద్యార్థులు



విద్యార్థి వి.తరుణ్



వి.ధనుంజయ్, విద్యార్థి తరుణ్ తండ్రి



విద్యార్థి భరత్



ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థి భరత్

అనంతపురం,

మే 19 ప్రభాతవార్త బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక సదుపా యాలను కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన తరగతి గదులు ఉండడం, నాణ్యమైన బోధన చేయడం, విద్యార్థులకు పలు రకాల సంక్షేమ పథకా లను అందజే యడం చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశా లల్లో ఎన్రోల్మెంట్ పెంచేందుకు బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆధ్వర్యంలో అమలు చేయడం జరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కార్యక్రమాల గురించి క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరిస్తూ వారిని బడిలోకి తీసుకువచ్చేలా కృషి చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు మండల, గ్రామీణ ప్రాంతాల్లో పలువురు విద్యార్థులు ముందుకు వస్తున్నారు. ఇందులోభాగంగా కంబదూరు మండలం పి.వెంకటంపల్లి గ్రామానికి చెందిన వి.తరుణ్ అనే విద్యార్థి, తన తండ్రి వి.ధనుంజయ గారి నిర్ణయంతో ప్రైవేట్ విద్యాసంస్థ అయిన శ్రీ చైతన్య స్కూల్ నుండి ప్రభుత్వ పాఠశాలైన ఎంపీపీఎస్ పి.వెంకటంపల్లి పాఠశాలలో ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందాడు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం కల్పిస్తున్న ఆధునిక సదుపాయాలు, విశాలమైన తరగతి గదులు, నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ బోధన, విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు మమ్మల్ని ఆకర్షించాయని తెలిపారు. విద్యార్థి వి.తరుణ్ తండ్రి వి.ధనుంజయ మాట్లాడుతూ.. "ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయి. మా బిడ్డకు మంచి విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం, విశాలమైన గదులు, ఆట స్థలం, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్ వంటి సదుపాయాలు అందుతున్నాయి. ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమ బోధన చాలా బాగుంది. అందుకే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నిర్ణయించుకున్నాము" అని తెలిపారు. పాఠశాలలో చేరిన మరో విద్యార్థి ఆర్.భరత్ కూడా ఆనందం వ్యక్తం చేస్తూ, "మా కొత్త స్కూల్ చాలా పెద్దగా ఉంది. టీచర్లు బాగా చెప్పుతు న్నారు. మధ్యాహ్న భోజనం కూడా బాగుంటుంది. ఏపీ రెసిడెన్షియల్ మరియు నవోదయ పాటశాలలకు కోచింగ్ కలదు. నాకు స్కూల్ బాగా నచ్చింది" అందువలన నేను శ్రీ చైతన్య స్కూల్ నుండి ప్రభుత్వ పాఠశాలైన ఎంపీపీఎస్ పి.వెంకటంపల్లి (కంబదూరు మండలం) పాఠశాలలో ఒకటో తరగతిలో అడ్మిషన్ పొందాను. విద్యార్థి తండ్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక వసతులు కల్పిస్తున్నారని పిల్లలకు కావాల్సిన నోటు పుస్తకాలు బ్యాగులు, పుస్తకాలు షూస్ లాంటివే కాకుండా విద్యాభివృద్ధిని ప్రోత్సహించడానికి తల్లికి వందనం పథకం లాంటివి కూడా ప్రవేశపెట్టార న్నారు. మధ్యాహ్నం సమయంలో చక్కటి మధ్యాహ్న భోజన వసతిని కల్పిస్తున్నారు అన్నారు. అలాగే ఎంతో అనుభవం ఉన్నటు వంటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ఆధునిక సాంకేతికతను కూడా మేలవించి బోధిస్తున్నారని పిల్లల్లో నైతిక విలువలు పెంపొందిస్తున్నారని తెలియజేశారు. ప్రైవేటు పాఠశాలలకు తీసిపోన టువంటి క్రీడలు, డిజిటల్ విద్య, ఆరోగ్య నైపుణ్య అభివృద్ధికి కూడా అధిక ప్రాధాన్యం ప్రభుత్వ పాఠశాలలో ఉందని తెలియజేశారు. కనుక ప్రతి ఒక్కరూ ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆరెకటికల కులవృత్తి పనిముట్లపై మంత్రి సవితమ్మతో చర్చ

అనంతపురం కల్చరల్, మే 19 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను ఆరెకటిక సూర్యవంశం వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ హనుమంత్ గారి కృష్ణారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆరెకటికల కులవృత్తి పనిముట్ల పంపిణీ, వృత్తిదారుల అభివృద్ధి, ప్రభుత్వ సహాయ పథకాల అమలు తదితర అంశాలపై మంత్రితో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు.

ఆరెకటిక వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు అవసరమైన పనిముట్లు అందించి ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం బీసీ వర్గాల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను మంత్రి సవితమ్మ వివరించగా, ఆరెకటిక వృత్తిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన తరిమెల వైఎస్ఆర్‌సిపి అభిమానులు

శింగనమల, మే 19 ప్రభాతవార్త

వైఎస్ఆర్‌సిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో తరిమెలకు చెందిన మాజీ వాలెంటీర్లు హేమా, కృష్ణవేణి, వసుంధర, వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలు, జి.మహేష్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు వారు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రజల కోసం మరింత బలంగా పని చేస్తామని వారు తెలిపారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి సహకరించిన శింగనమల నియోజకవర్గ పరిశీలకుడు కంచి రెడ్డి భాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయ కులు ఆలూరు బాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో భేటి తమలో నూతన ఉత్సాహాన్ని నింపిందన్నారు.



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్ఆర్‌సిపి కార్యకర్త తరిమెల మహేష్



వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్ఆర్‌సిపి అభిమానులు

## మోది విధానాలతోనే ప్రజలపై భారం

### సుందరయ్య స్ఫూర్తితో సిపిఎం పోరాటం 41వ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి - వి.శ్రీనివాసరావు

అనంతపురం కలెక్టరేట్ మే 19 ప్రభాతవార్త

మోది విదేశాంగ విధానం మూలంగానే ప్రజలపై భారాలు పడతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధులు, కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా అనంతపురం నగరంలోని శాంతినగర్ బోర్డు వద్ద సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ జరిగింది. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా వి.శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు. ఇటువంటి బిజెపి రాష్ట్రంలోని చంద్రబాబు మద్దతు తెలుపుతున్నారని దుయ్యబట్టారు. కెజి బేసిన్‌లో 21 వేల టన్నుల గ్యాస్ లభిస్తుండగా రాష్ట్రానికి 50 శాతం ఇవ్వాల్సి ఉందన్నారు. అది ఇవ్వకుండా నేరుగా గుజరాత్‌కు తరలించి అమ్ముకుంటున్నా అడగలేని స్థితిలో చంద్రబాబు నాయుడు ఉన్నారని యెద్దేవ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిల్లల ను అధికంగా కనండని చెప్పడం వెనుక కార్పొరేట్ ప్రయోజ నలే ఉన్నాయని తెలిపారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సుందరయ్య లాంటి నాయకుల స్ఫూర్తితో పోరాటం సాగించాల్సిన అవసరముందని పిలు పునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోనే ఇటీవల దళిత వ్యక్తి చనిపోతే ఖననం చేయడానికి ఆరు అడుగుల జాగా లభించలేదని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఈ పాలకులకు పట్టడం లేదని విమర్శించారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఓబుళు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్ల కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, నగరన నాయకులు వలి, ముర్తుజా, ప్రకాశ్‌రెడ్డి, మసూద్ తదితరులు పాల్గొన్నారు.



సుందరయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

## మండల కళాకారుల అధ్యక్షునిగా తిరుపాల్‌నాయక్

శింగనమల, మే 19 ప్రభాతవార్త

మండల పరిధిలని నాగలగుడ్డం తాండాకు చెందిన తిరుపాల్‌నాయక్‌ను వైఎస్ఆర్‌సిపి మండల కళాకారుల అధ్యక్షునిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా తిరుపాల్‌నాయక్ మాట్లాడుతూ..

తనకు ఈ పదవి కేటాయించి నందుకు వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు జగన్ మోహన్‌రెడ్డికి, నియోజకవర్గ సమ న్వయ కర్త సాకే శైలజానాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన కళను గుర్తించి తనకు ఈ అవకాశాన్ని ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉం దని, అదే విధంగా భవి ష్యత్తులో కళా కారులను గుర్తి ంచి వారికి అన్ని విధాలుగా అం డగా ఉంటానని, వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపే తానికి కృషి చేస్తానని తెలిపారు.



బి.తిరుపాల్ నాయక్

## రైతు కుటుంబాలకు అండగా వైఎస్ఆర్ సిపి

### - రాష్ట్ర రైతు విభాగ జనరల్ సెక్రెటరీ బొమ్మన శ్రీరామిరెడ్డి

శింగనమల, మే 19 ప్రభాతవార్త

మండల పరిధిలోని నాగలగుడ్డం తాండ గ్రామంలో నీరు లేక ఎండిపోతున్న భాస్కర్‌నాయక్ చీనీ తోటను మంగళవారం వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర రైతు విభాగ జనరల్ సెక్రెటరీ బొమ్మన శ్రీరామిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని అనే భావనతో తమ నాయకుడు వైఎస్ జగన్‌మోన్‌రెడ్డి రైతు పక్షాన నిలిచి వారి కొరకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశాడన్నారు. నేడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. రైతులు ధైర్యంగా ఉండాలని, మీ కుటుంబాలకు వైఎస్ఆర్‌సిపి ఎప్పుడు తోడుగా ఉంటుందని జరిగిన పంట నష్టంపై కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి రైతులకు తగిన పరిహారం అందేలా పోరాడు తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సమ న్వయ కర్త వీరాంజినేయులు, వైఎస్ఆర్‌సిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీని వాసులు నాయక్, రాష్ట్ర మహి ళా నాయకురాలు బండి లలి తా కళ్యాణి, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున రెడ్డి, నాగవ ర్ధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, జగ న్మో హన్‌రెడ్డి, ఎన్‌వి .నారాయణ, మండల పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు దాసరి వెంకటరమణ, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎండిన చీనీ తోటను పరిశీలిస్తున్న బొమ్మన శ్రీరామిరెడ్డి

## గద్వాల్ నేషనల్ తైక్వాండోలో తాడిపత్రి క్రీడాకారుల పతకాల పంట

తాడిపత్రిటౌన్, మే 19 ప్రభాతవార్త

గద్వాల్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన 16వ ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో తాడిపత్రి తైక్వాండో క్రీడాకారులు సత్తా చాటారు. ఇందులో ఒకరు స్వర్ణం, నలుగురు రజతాలు, ఇద్దరు కాంస్య పతకాలతో మెరిశారని స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ అనంతపురం జిల్లా కార్యదర్శి ఎం.సాయిబాబా తెలిపారు. కె.లోకేష్‌గౌడ్ కేడెట్ బాలుర అండర్-33 కిలోల విభాగంలో స్వర్ణ పతకం, జి.తాగూర్ హర్షవర్ధన్, కేడెట్ బాలుర అండర్-37 కిలోలు, ఎం.తబ్రేజ్ కేడెట్ బాలుర అండర్-45 కిలోలు, పద్మప్రియ సబ్ జూనియర్ అండర్-32 కిలోలు, సాహిక సబ్ జూనియర్ అండర్-35 కిలోలు విభాగంలో రజత పతకాలు, అయాన్ యూసుఫ్ జాయ్ అండర్-18 విభాగం, ఎం.హర్షిత్ స్వరూప్‌రెడ్డి అండర్-23 విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కార్యదర్శి ఎం.సాయిబాబా అభినందించారు. క్రీడాకారుల విజయాల వెనుక కోచ్ నరేష్ కృషి ఎంతో ఉందని కొనియాడారు. జాతీయ స్థాయిలో తాడిపత్రి ఖ్యాతిని ఇనుమడింపజేసిన క్రీడాకారులను పలువురు ప్రముఖులు, క్రీడాభిమానులు ప్రశంసించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

04ATP19.qxd:04ATP19.qxd 20/05/26 11:16 PM Page 1



# ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి హేయమైన చర్య.. ఎమ్మెల్యే రాజు

## వైకాపా ప్రభుత్వంలోనే దళితులపై అత్యధిక దాడులు

మడకశిర టౌన్ మే 19 ప్రభాతవార్త

ఎంపీపీ ఛాంబర్ తాళం ఇవ్వాలని ఎంపీడీవో జవహర్ బాబును అడిగారు. మండలాధ్యక్షురాలు వస్తేనే తాళాలు ఇస్తామని ఎంపీడీవో చెప్పడంతో మాకే ఎదురు చెబుతావ అంటూ దాడి దాడి చేయడం ఏమైనా చర్య అని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే రాజు చరవాణి ద్వారా ప్రభాతవార్తతో మాట్లాడుతూ : జగన్ రెడ్డి రౌడీ మూకలు దళితులపై రెచ్చిపోయి దాడులకు పాల్పడుతున్నాయి. నా ఎస్సీలు, నా ఎస్టీలు, అంటూ నమ్మించి గొంతుకోస్తున్న జగన్ రెడ్డి దళితుల గొంతు కోస్తున్నారని అన్నారు. జగన్ రెడ్డి ఐదేళ్లపాలనలో 200 మందికి పైగా దళితులను దారుణంగా హతమార్చారని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో దళితులను ఎంతగా ఊచకోత కోశారో దళిత డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ అచ్చెన్న ఘటనలే చెబుతాయి అన్నారు. జగన్ పాలనలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయని స్వయంగా రాజ్యసభలో కేంద్రం లెక్కలతో సహా వివరించింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో 56,981 జరిగాయి అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్ల పాలనలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.27,000కోట్లు, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రూ.5,000 కోట్లు మొత్తం రూ.33వేల కోట్లను దారి మళ్లించి దళితులకు అన్యాయం చేశారు. దీంతో లక్షలాదిమంది దళిత సోదరులు కోట్లాది రూపాయల బ్యాంకు సబ్సిడీ లోన్లు కోల్పోయారు అన్నారు. జగన్ రెడ్డికి అధికార మదం ఇంకా పోలేదు. ప్రజలు ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం చేసి శిక్షించినా జగన్ తీరు మార్చుకోలేదు అని అన్నారు. వైసీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, అతని అనుచరులు 20 మందితో వచ్చి ఎంపీడీవో జవహర్ బాబుపై దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. వైసిపి తన హయాంలో దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన నిందితుడు అనంతబాబుపై కఠిన చర్యలు తీసుకోలేదు. నేరస్తుడిగా అభియోగాలు మోపుతున్న నిందితుడ్ని జగన్ రెడ్డి వెంటేసుకుని తిరుగుతున్నాడు అన్నారు. తాడిపత్రిలో దళిత సిఐని కులం పేరుతో దూషించి అద్దె ఇంట్లో బలవన్మరణానికి పాల్పడేలా చేశారన్నారు. కోడికత్తి డ్రామాతో దళిత బిడ్డ జనుపల్లి శ్రీనివాస్ ని ఐదేళ్లుగా జైలులో మగ్గబెట్టి తల్లిదండ్రులను కష్టాలు పాలు చేశారన్నారు. వరప్రసాద్ అనే వ్యక్తి అక్రమ ఇసుక దందాను ప్రశ్నించినందుకు శిరోముండనం చేసి అవమానించారని అని మండిప డ్డారు. జగన్ నివాసానికి కూతవేటు దూరంలో దళిత యువతిపై గ్యాంగ్ ముఠానాయకుడు వెంకటరెడ్డి ని ఇప్పటికీ అరెస్టు చేయలేదు అని అన్నారు. దళితులంటే జగన్ రెడ్డికి ప్రేమే లేదు. ఎన్నికల సమయంలో మాత్రమే జగన్ రెడ్డికి దళితుల యోగ క్షేమాలు గుర్తుకు వస్తాయి. ఓట్లు కోసం దళితులు కావాలి, పక్కన కూర్చోడానికి మాత్రం దళితులు వద్దు. దళితుల ఓట్లతో రాజకీయ పీఠమెక్కాలి, వాళ్ల ధన, మాన, ప్రాణాలకు మాత్రం రక్షణ కరువు. గత ఐదు సంవత్సరాల్లో జగన్ రెడ్డి దళితులపై చూపించిన కపట ప్రేమ ఇదే అని అన్నారు.



ఎమ్మెల్యే రాజు ఫైల్ ఫోటో.

# చేనేత కార్మికులకు ఆర్థిక స్వావలంబన కల్పించాలి

## తిమ్మాపురంలో చేనేత కార్మికులతో కలెక్టర్ ఆనంద్ ముఖాముఖి - చేనేత కార్మికుల కష్టాలను విన్న కలెక్టర్ ఆనంద్ - విద్యాశాఖ అధికారులతో కలిసి బడి పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్

కంబదూరు, మే ,19 ప్రభాతవార్త

కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఆనంద్ చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం నేపథ్యంలో భంభం బాబా స్వామి మందిరంలో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితులు, జీవన విధానం, మగ్గాల నిర్వహణ, చీరల తయారీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముడి సరుకు ఎక్కడి నుంచి వస్తోంది, చీరలను ఎక్కడ మార్కెట్ చేస్తున్నారు, ఒక్క చీర తయారికి ఎంత సమయం పడుతోంది, ఒక వార్ప్‌కు ఎన్ని చీరలు వస్తున్నాయి, ముద్ర రుణాలు పొందారా, ఉచిత విద్యుత్ వల్ల ఎలాంటి ప్రయోజనం కలుగుతోందనే అంశాలపై కార్మికులను ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందిస్తే ఆదాయం పెంచుకునే అవకాశం ఉంటుందని చేనేత కార్మికులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆనంద్, చేనేత కార్మికులు ఆర్థిక స్వావలంబన సాధించేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడి పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు సాధించేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వినూత్నంగా బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రచార వాహనం ద్వారా నిర్వహించడంతో మండల విద్యాశాఖ అధికారుల పనితీరుపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి వరప్రసాద్, అభివృద్ధి అధికారి బసవరాజు, తహశీల్దార్ బాలకిషన్, ఎంఈఓ ఉమాపతి, మధన్ మోహన్, ఉన్నత పాఠశాల హెడ్‌మాస్టర్ భారతి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం తిమ్మప్ప, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్



బడి పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

# వైసిపి నాయకుల రాక్షస కృత్యాలకు బలిపశువులుగా మారిన ఎస్సీ వర్గాలు..

## - ప్రశ్నించే గొంతుకను కసాయి వాడిలా గొంతు నొక్కేసిన ఘనత వైసిపి నాయకులది - మూడు దేశాల యుద్ధ ఫలితం దేశ వ్యాప్తంగా అన్ని రంగాలకు తీవ్ర నష్టం - ప్రతిపక్ష పార్టీ వాస్తవాలు తెలుసుకుని విమర్శిస్తే బాగుంటుంది - మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, మే 19 ప్రభాతవార్త

గత ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎస్సీ వర్గాలపై వైసిపి నాయకులు చేసిన రాక్షస కృత్యాలు, హత్యా కాండాల ఫలితంగా ఎస్సీ వర్గాలు బలిపశువులుగా మారి తమ నిండు నూరేళ్ల జీవితాన్ని అర్థాంతరంగా ముగిసిపోయేలా చేసిన ఘనత వైసిపి నాయకులకే దక్కిందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ధ్వజమెత్తారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి జగన్ హయాంలో అమాయకులైన ఎస్సీ వర్గాలకు చెందిన వ్యక్తులను నిర్ధాక్షిణ్యంగా, నిరంకుశంగా హతమార్చి వారి కుటుంబాలను చీకటిలోకి నెట్టి వేయడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. వైసిపి ఎమ్మెల్సీ అనంత బాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను దారుణంగా హతమార్చి అతని డెడ్‌బాడీని పార్సిల్ చేసి ఇంటికి పంపించడం ఎంత దుర్మార్గమో రాష్ట్ర ప్రజలు ఆలోచించాలన్నారు. దీంతోపాటు కరోనా సమయంలో వైద్య సదుపాయాలు కల్పించాలని అడిగిన దళిత వర్గాలకు చెందిన డా.సుధాకర్‌ను నడిరోడ్డుపై గుండు గీయించి అతన్ని పిచ్చి వాడిగా చిత్రీకరించి, నిండు నూరేళ్ల జీవితాన్ని చిదిపివేసిన వైసిపి నాయకులకు రాష్ట్ర ప్రజలే తగిన గుణపాఠం చెప్పారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ వర్గాలపై వైసిపి చేసిన దురాగతాలు, ఆకృత్యాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. వైసిపి నాయకుల చేతిలో హతమైన ఎస్సీ వర్గానికి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలన్న సదుద్దేశ్యంతో కదిరిలో వారి శాంతి యుత సంస్మరణ సభ ఏర్పాటు చేశామన్నారు. ఎస్సీ వర్గాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలవేళలా వెన్నుదన్నుగా నిలిచి, అండగా నిలవడంతోపాటు వారి సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా కందికుంట పేర్కొన్నారు. ఎస్సీ వర్గాలపై ఏ పార్టీ వారైనా, ఎంతటి వారైనా దాడులు చేస్తే ఉపేక్షించేది లేదని అట్టి వారిపై ఉక్కుపాదం మోపుతామని కందికుంట హెచ్చరించారు. ఇదిలా ఉండగా దేశ వ్యాప్తంగా ఇరాన్, అమెరికా యుద్ధ పరిణామాల నేపథ్యంలో నిత్యావసర వస్తువులు, వంట గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగాయన్న సంగతి వైసిపి నాయకులు, ఇతర పార్టీల నాయకులు ఒకసారి గుర్తెరిగి మసలు కోవాలని ఆయన హితవు పలికారు. యుద్ధ వాతావరణ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ ఇబ్బందిగా మారిన తరుణంలో ప్రతి పక్ష పార్టీలు వాస్తవాలను ప్రజలకు వివరించి సహకరించాల్సి ఒదిపోయి ఇలా ఆందోళన లు, ధర్నాలు చేస్తామని ప్రజలను మభ్య పెట్టడం సరైన పంతా కాదన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రస్తుతం ఏ సమస్యలు వస్తున్నాయో తెలియ చెప్పాలని, వాటిని ఏ విధంగా పరిష్కరించాలో ప్రజల కు వివరించి ప్రజల మన్ననలు పొంది ఆమోద యోగ్యంగా ఉంటుందని ఎమ్మెల్యే కందికుంట స్పష్టం చేశారు. సమావేశంలో ఎమార్పిఎస్ నాయకులు జయరామ్ పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీ, ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని 29వ వార్డు అంబేద్కర్ కాలనీలో వైసిపి ఎమ్మెల్సీ డ్రైవర్‌గా పని చేసిన సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్‌లపై గత వైసిపి ప్రభుత్వంలో దళితులపై జరిగిన దాడులు, అరాచకాలను ఎండగడుతూ సంస్మరణ సభను నిర్వహించారు. వైసిపి ఎమ్మెల్సీ అనంత బాబును సస్పెన్షన్ చేయకుండా దళితులకు ద్రోహం చేసిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు విశ్వనాథ్, పట్టణ ఎస్సి సెల్ అధ్యక్షులు హరి ప్రసాద్, దండోరా నాయకులు జయరామ్, ఆరో వార్డు ఇన్‌చార్జ్ చైతన్య, టిడిపి పిచ్చిలి శంకర, మధు, మారుతి, రాజ, దళిత సంఘాల నాయకులు, టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

# గ్రామస్థాయి సుపరిపాలనకు డిపిఆర్సి భవనాలు ఎంతో కీలకం

## 2 కోట్లతో పుట్టపర్తిలో డిపిఆర్సి భవన నిర్మాణానికి కలెక్టర్ శ్యాంప్రసాద్ భూమి పూజ హాజరైన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి టౌన్, మే 19, ప్రభాతవార్త

శ్రీ సత్య సాయి జిల్లాలో గ్రామస్థాయి సుపరిపాలన మరింత బలోపేతం కలిగించే దిశగా డిపిఆర్సి (దీశిళిది) భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు మంగళవారం శంకు స్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధి లోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న డిపిఆర్సి భవనానికి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ గ్రామస్థాయి పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామాల అభివృద్ధిని వేగవంతం చేయడం కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. గ్రామ పంచాయతీల పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడంలో డిపిఆర్సి భవనాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభు త్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇ స్తోంద న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, పారదర్శక పరిపాలన, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించడంలో ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు రామారావు, గంగాధర్ నాయుడు, శ్రీరామ్ రెడ్డి, అంబులెన్స్ రమేష్ కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, మాజీమంత్రి తదితరులు

# అధినేతతో అభిమాని

యాడికి(తాడిపత్రి), మే19, ప్రభాతవార్త:తమ అభిమాన నాయకుడు, వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు యాడికి మండల బీసీ నాయకుడు, మండల వైకాపా జనరల్ సెక్రటరీ బాలగంగయ్య యాదవ్ తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం వద్ద తమ అధినేతను చిక్కేపల్లి అశోక్‌రెడ్డితో పాటు కలిసి మండలంలోని రాజకీయ పరిస్థితులను గురించి వివరించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం మారిన రెండేళ్ల తర్వాత తమ నాయకున్ని కలవడం ఎంతో సంతోషంగా ఉందని, కేతిరెడ్డి పెద్దారెడ్డి గెలుపు కోసం, పార్టీ అభ్యున్నతికి ద్విగుణీకృత ఉత్సాహంతో పనిచేస్తామని ఆయన అన్నారు.



వైకాపా అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన బాలగంగయ్య

# నిషేధిత సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై ఆకస్మిక దాడులు

## - రూ.14,000 జరిమానా



షాపులపైన దాడులు నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

అనంతపురం, మే 19, ప్రభాతవార్త

నగరంలోని 6వ సర్కిల్ పరిధిలో నిషేధిత సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ విక్రయించే వారిపై ఆకస్మిక దాడులు నిర్వహించి జరిమానా విధించారు. మంగళవారం కమిషనరు జశ్వంత్‌రావు ఆదేశాల మేరకు ప్లాస్టిక్ వినియోగంపై ఈ దాడులు నిర్వహించి పలు వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఆరోగ్యాధికారి సునీత, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు తదితరలు పాల్గొన్నారు.

# భూ రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి

## కంబదూరు మండలం పర్యటనలో జిల్లా కలెక్టర్ ఆనంద్ తహశీల్దార్ కార్యాలయంలో రికార్డు గదిని పరిశీలించిన కలెక్టర్

కంబదూరు, మే 19, ప్రభాతవార్త

భూ రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. కంబదూరు మండలం ఒబుగానిపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో జరుగుతున్న భూ రీ సర్వేను మంగళవారం కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ రీసర్వేను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. సర్వే ముందు రైతులకు సమాచారం అందించి నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. భూమి సరిహద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన, రోవర్ యంత్రం పనితీరును స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. అలాగే కొలతల విధానం, సాంకేతిక పరికరాల వినియోగం భూ వివరాల నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు . ముఖ్యంగా రైతుల భూమికి హద్దులు కచ్చితంగా నమోదు కావాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రతి దశలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ ఆనంద్ రైతులతో నేరుగా మాట్లాడుతూ భూ రీ సర్వేపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. నాలుగో దశ రీ సర్వేలో భాగంగా ఒబుగానిపల్లిలో 9,99.51 ఎకరాల్లో రీ సర్వే చేపట్టడం జరుగుతుందని తహశీల్దార్ కలెక్టర్ కు వివరించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్ కంబదూరు తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డ్ గదిని పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ బాలకిషన్ , రీ సర్వే డీటీ గణేష్, డిఐఓఎస్ నాగరాజు, మండల సర్వేయర్ శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్లు లక్ష్మీ, సోమశేఖర్, నాగేంద్ర, విఆర్వో శ్రీ లక్ష్మి తదితర అధికారులు ఉన్నారు.



రీ సర్వేలో రోవర్ యంత్రం పనితీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్



రీ సర్వేపై రైతుల భిప్రాయాలను తెలుసుకుంటున్న కలెక్టర్ ఆనంద్



తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేస్తున్న దృశ్యం

# రైతులకు సబ్సిడితో పశువుల దాణా - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, మే 19 ప్రభాతవార్త

మండలపరిధిలోని సలకం చెరువు గ్రామంలో రైతులకు పశుపోషకులకు అండగా నిలిచే విధంగా మంగళవారం సబ్సిడిపై పశువుల దాణా పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50శాతం సబ్సిడితో 50 కెజిల పశువుల దాణాను 550 రూపాయలకే అందిస్తూ పశుసంవర్ధక రంగానికి కూటమి ప్రభుత్వం చేయూతనందిస్తోందని రైతులకు సగం ధరకే దాణా అందజేయడం ద్వారా ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇందులో భాగంగా కల్లుమడి రైతు సేవా కేంద్రం వద్ద 7 మెట్రిక్ టన్నులు, సలకం చెరువు 5 మెట్రిక్ టన్నులు, గార్లదిన్నె వద్ద 7 మెట్రిక్ టన్నుల పశువుల దాణా అందుబాటులో ఉందని, త్వరలోనే ఇతర ప్రాంతాలలో దాణా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు పశుపోషకుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నియోజకవర్గంలోని రైతుల ఆర్థిక అభివృద్ధికి, పశు సంవర్ధక రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో శింగనమల ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు డా. పద్మనాభం, తహశీల్దారు శేషారెడ్డి, ఎంపిడిఓ భాస్కర్, టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు, మాజీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, తిరుపాల్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ యాదవ్, సింగిల్ విండో అధ్యక్షులు గుర్రం లక్ష్మినారాయణ, రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



సబ్సిడి దాణా అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి - అధికారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశం

అనంతపురం రూరల్, మే 19 ప్రభాతవార్త

నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, పూర్తి చేసిన పనులకు ప్రారంభోత్సవాలు సిద్ధం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో పి.ఆర్.ఐ ఇంజనీర్లతో ఆమె సమీక్షసమావేశంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్, కనగానపల్లి, ఆత్మకూరు మండలాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న రోడ్ల పురోగతి గురించి చర్చించారు. ఇప్పటికే పూర్తయిన రోడ్లను ఎప్పుడు ప్రారంభించాలన్నది, ఇంకా ఏ గ్రామంలోరోడ్లు నిర్మించా లన్నది ప్రతిపాదనలుసిద్ధంచేయాలని ఆదేశించారు. మండలాలు గ్రామాల వారీగా, మండల కేంద్రాలకు, ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి అవసరమైన లింకు రోడ్లను గుర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాల జాబితాను తయారు చేయాలని, సీఎంఆర్ఎఫ్ తో పాటు వ్యక్తిగతంగా సాయం చేసిన వాటి గురించి కూడా పూర్తిస్థాయిలో నివేదిక సిద్ధం చేయాలన్నారు.

**ఎమ్మెల్యే సునీత చొరవతో ఆత్మకూరులో తాగునీటి సమస్యకు పరిష్కారం**

: గత కొన్ని రోజులుగా ఆత్మకూరు మండల కేంద్రంలోని పలు కాలనీల్లో తాగునీటి సమ స్య నెలకొంది. సోమవారం రాత్రి ఎమ్మెల్యే సునీత ఆత్మకూరు మండల కేంద్రానికి వెళ్లిన సమయంలో స్థానికులు ఈ సమస్యను తెలియజేశారు. వెంటనే ఆమె జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందిని వివరించారు. జిల్లా కలెక్టర్, డిపిఓ సమస్యపై స్పందించారు. మంగళవారం ఉదయం స్థానిక అధికారులు ట్యాంకర్ల ద్వారా సమస్య ఉన్న ప్రాంతాలలో నీటిని అందించారు. సమస్య చెప్పిన వెంటనే... ఎమ్మెల్యే సునీత స్పందించారని ఈ సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు వాటర్ ట్యాంక్ తో తాగునీరు అందిస్తున్న దృశ్యం.

# ధర్మవరం మెగా క్లస్టర్ సదుపాయాల కల్పనకు వేగవంతమైన చర్యలు చేపట్టండి

## జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

శ్రీ సత్యసాయి జిల్లా, మే 19, ప్రభాతవార్త ప్రతినిధి

9.84 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు కానున్న"ధర్మవరం మెగా క్లస్టర్" ద్వారా చేనేత కార్మికుల ఆర్థిక అభ్యున్నతి, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ మార్కె టింగ్ సదుపాయాల కల్పనకు క్షేత్రస్థాయిలో వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవరం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్ నందు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్.హెచ్.డి.పి) కింద రూ. 38.31 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న "ధర్మవరం మెగా చేనేత క్లస్టర్" ప్రణాళికలు, మౌలిక వసతుల కల్పనపై జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 22,506 మంది చేనేత కార్మికులు, 78చేనేత కార్మిక సంఘాలు, మగ్గాలు10,114, పవర్ లూమ్స్: 1,600 ద్వారా వార్షిక టర్నోవర్ రూ. 235.60 కోట్లు జరుగుతోందన్నారు. ధర్మవరం పట్టు చీరలు, పావడాలకు 2010లో (జి ఐ నంబర్ 207) గుర్తింపు లభించిందన్నారు. ప్రతిపాదిత మౌలిక వసతులు, బడ్జెట్ కేటాయింపులు (మొత్తం రూ. 3831.03 లక్షలు), ఈ మెగా క్లస్టర్ పరిధిలో నిర్మించనున్న మౌలిక సదుపాయాలు, వాటి విస్తీర్ణం మరియు అయ్యే వ్యయం (కేంద్ర వాటా: రూ. 2996.80 లక్షలు, రాష్ట్ర వాటా: రూ. 657.70 లక్షలు, లబ్ధిదారుల వాటా: రూ. 176.53 లక్షలు) వివరాలు బిల్ట్ అప్ ఏరియా (ఎస్ ఎఫ్ టి), వ్యక్తిగత లబ్దిదారుల వస్తువుల పంపిణీ, అత్యాధునిక డిజైన్ స్టూడియో, మార్కెట్ అభివృద్ధి కేంద్రం, బ్రాండింగ్, గ్రూప్ వర్క్ షెడ్ల నిర్మాణం, ఎగుమతుల ప్రోత్సాహం, ఆధునిక డైయింగ్ కేంద్రం, పరిపాలనా భవనం, ప్రదర్శన శాల గిడ్డంగి , వాల్యూ అడిషన్ యూనిట్ (దుస్తుల తయారీ కేంద్రం) ప్రాజెక్ట్ మానిటరింగ్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ లకు మొత్తం వ్యయం 92,585.59 ఎస్ ఎఫ్ టి రూ. 3831.03 లక్షలు అవుతుందన్నారు. చేనేత కార్మికుల సగటు నెలసరి ఆదాయం రూ. 1025 వేల నుండి రూ. 3040 వేలకు (2530 వృద్ధి) పెరుగుతుందనీ, .ఆధునిక మెషినరీ సాంకేతికత ద్వారా ఉత్పత్తిలో 2030 వృద్ధి సాధించవచ్చన్నారు. ఉపాధి కల్పన ప్రత్యక్షంగా 8,000+ మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి (5,790 మంది చేనేత కార్మికులు, 125 మంది డిజైనర్లు/వీవర్లు). రాబోయే ఐదేళ్లలో అదనంగా రూ. 5075 కోట్ల ఎగుమతులు సాధించడమే లక్ష్ యం. ఈ ప్రాజెక్టును ఐదు దశల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. స్థిరత్వ సమీక్ష, ఆదాయ సృష్టి, దీర్ఘకాలిక ప్రభా వ మూల్యాం కనం.ఈ క్లస్టర్ కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ 2047, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్వర్ణాంధ్ర 2047 దార్శనికతకు అనుగుణంగా రూపుదిద్దుకుంటోందన్నారు. స్వదేశీ డిజైన్ నైపుణ్యం, ఇకామర్స్ అనుసంధానం, పర్యావరణ హితమైన గ్రీన్ బ్రాండింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో ధర్మవరం పట్టుచీరల బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయనున్నారు. పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని, గడువులోగా మౌలిక వసతుల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశ్రామిక వ్యర్థ జలాల శుద్ధి కోసం 80100 కే ఎల్ డి సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్న జీరో లిక్విడ్ డిస్చార్జ్ (జెడ్ ఎల్ డి) ప్లాంట్‌ను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్మించాలని, కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో చేనేత ఎడి రామకృష్ణ ,అధికారులు ధర్మవరం నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు,కమతం కాటమయ్య,ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్,పరిసే సుధాకర టిడిపి పట్టణ అధ్యక్షుడు,రాళ్లపల్లి షరీఫ్ నూర్ భాషా సంఘం రాష్ట్ర డైరెక్టర్,సంద రాఘవ,బీరే శీన,చట్టా లక్ష్మీనారాయణ, కాచర్ల కంచన్న, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు, కేశగాల శ్రీనివాసులు టిడిపి జిల్లా మీడియా కోఆర్డినేటర్, జింకా పురుషోత్తం,కొత్తపేట ఆది,కరెంట్ ఆది,తధితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



హాజరైన సంబంధిత అధికారులు

# ఇచ్చిన మాట ప్రకారం రోడ్డు తెచ్చాం : ఎమ్మెల్యే పరిటాల సునీత

## - నాగసముద్రం ఆలయానికి ధూప దీప నైవేద్యం కోసం ప్రభుత్వ సాయం

చెన్నేకొత్తపల్లి, మే 19 ప్రభాతవార్త

ఇచ్చిన మాట ప్రకారం ప్రతి మారుమూల గ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండాలని.. ప్రజలు ఎక్కడా ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. చెన్నేకొత్తపల్లి మండల పరిధిలోని ధర్మవరం నాగసముద్రం వెళ్లే ప్రధాన రహదారి నుంచి చందమూరు గ్రామంలోకి 50 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన సిసి రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే సునీత ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు పూల వర్షం కురిపిస్తూ టపాసులు పేలుస్తూ కనివిని ఎరుగని రీతిలో ఆమెకు స్వాగతం పలికారు. సీసీ రోడ్డు ప్రారంభించిన అనంతరం గ్రామంలోకి నడిచి వచ్చిన ఎమ్మెల్యే సునీతకు ప్రతి ఇంటి నుంచి పూల హారాలు, పుష్పగుచ్చాలు అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి రోడ్డు ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిధులు కేటాయిస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక గుంతలు పడ్డ రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని.. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపామన్నారు. చెన్నేకొత్తపల్లి మండలంలో గత రెండేళ్లలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఇప్పటికే చాలా గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించామని, ఇది గత ప్రభుత్వంలో లాగా మాటలు చెప్పే ప్రభుత్వం కాదని... మాట ఇచ్చామంటే చేసి చూపిస్తామన్నారు. ప్రజలు ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని గుర్తించాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, హిందూపురం పార్లమెంటు ఉపాధ్యక్షులు దండు ఓబులేసు, మండల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



వేసిన రోడ్డును చూపుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత